సాక్షి నిర్మల్

సోమవారం । 13 । మార్చి । 2023



'గురుకులం'లో ప్రవేశాలు

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023-24 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉంది. 8లో▸



అన్నాబావుసాఠె ఆదర్శప్రాయుడు

నార్నూర్‌లో అన్నాబావు సాఠె విగ్రహాన్ని జెడ్పీ చైర్‌పర్సన్లు కోవ లక్ష్మి, రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆవిష్కరించారు. మహనీయుల అడుగు జాడల్లో నడవాలన్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.1 / 19.6

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం అంతగా ఉండదు.

న్యూస్‌రీల్

మైనార్టీల సంక్షేమానికి కృషి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తోందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈడెన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న హజ్ యాత్ర శిక్షణ శిబిరాన్ని ఆదివారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్ర అనేది పవిత్రమైనదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుభాష్ రావు, మైనార్టీ మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీ ప్రజావేదిక



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీవో

భైంసారూరల్(ముధోల్): రెండు రోజులపాటు మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక ముగిసింది. రెండు రోజులుగా డీఆర్‌డీఓ విజయలక్ష్మి మండల వ్యాప్తంగా చేపట్టిన పనుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈసీకి రూ.1,800, టీఏలకు రూ.41,859, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.1,134, పంచాయతీ కార్యదర్శులపై రూ.58,488, మొత్తంగా రూ.1,03,281 రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో గోపాలకృష్ణారెడ్డి, హెచ్‌ఆర్ సుధాకర్, ఎస్‌ఆర్‌పీ రాఘవులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

టీజేఎస్ బలోపేతానికి కృషి చేయాలి



కోదండరాంతో జిల్లా నాయకులు

ఖానాపూర్: జిల్లాలో టీజేఎస్ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కడపత్రి తిలక్ రావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం కోదండరాంను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా నాయకులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతం, ప్రజాసమస్యలు, తదితర విషయాలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు. నాయకులు తాట్ర భీంరావు, రమణ, సందీప్, బెన్‌హర్, ప్రవీణ్, వినయ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీవోఈ పరీక్ష



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్సీవో

ఉట్నూర్: గురుకుల కళాశాలల్లో ప్రవేశాల కోసం ఉట్నూర్‌లో ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆర్సీవో గంగాధర్ తెలిపారు. ఆయన పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు. 2,065 మంది విద్యార్థులు హాజరు కాగా, 177 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.



మంటలు ఆర్పుతున్న సిబ్బంది (ఫైల్)

అడవిలో అగ్గి



పెద్దూర్ సమీపంలో అడవిలో వ్యాపించిన మంటలు

- ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నా ఆగని మంటలు
- దగ్ధమవుతున్న పచ్చని చెట్లు
- మంటలతో వన్యప్రాణులకు ముప్పు

కడెం: అటవీ శాఖ అడవుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా అడవిలో అగ్గి రాజుకుంటూనే ఉంది. పచ్చని చెట్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. అటవీ సంరక్షణకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నా మంటలు అదుపులోకి రాక అడవి దగ్ధమవుతోంది. ఏటా వేసవిలో మంటలు చెలరేగి అడవి అగ్నికి ఆహుతవుతుండడంతో అటవీప్రాంతంలో పచ్చదనం తగ్గిపోతూ మైదానంలా మారుతోంది.

ముందస్తుగానే ఫైర్‌లైన్స్..

జిల్లాలో 3,56,251 హెక్టార్లలో భూ విస్తీర్ణం ఉండగా, 1,20,566.75 హెక్టార్లలో అడవులు ఉన్నాయి. 33.08 అడవుల శాతం అటవీ ప్రాంతం ఉంది. ఏటా వేసవిలో అడవుల్లో మంటలను అరికట్టేందుకు అటవీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఒక ప్రాంతంలో మొదలైన మంటలను మరో ప్రాంతంలోకి వ్యాపించకుండా వేసవి ప్రారంభానికి ముందే ప్రత్యేకమైన బ్లోయర్ మిషన్లతో రాలిపోయిన అకుల ఒక చోటాకు చేర్చి ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. అకుల కుప్పలుగా చేసి తగలబెడతారు. అయితే ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే మళ్లీ ఆకులు రాలి పేరుకుపోతున్నాయి. దీంతోపాటు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో అడవిలో మంటలు అంటుకుని వేగంగా ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తున్నాయి. దీంతో వృక్ష సంపద కాలిపోవడంతోపాటు వన్యప్రాణులకు ముప్పు ఏర్పడుతోంది.

ఆగని మంటలు..

అడవుల్లో మంటలు చెలరేగిన సమాచారన్ని వెంటనే తెలియజేసేందుకు అటవీ శాఖ గ్లోబల్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం ఏర్పాటు చేసింది. దీనిద్వారా ఎప్పటికప్పుడు అటవీ ప్రాంతాల్లో అంటుకున్న మంటలను శాటిలైట్ రిసీవ్ చేసుకుని హైదరాబాద్‌లోని అటవీశాఖ కార్యాలయానికి అందజేస్తుంది. అక్కడి నుంచి సంబంధిత అధికారుల సమాచారం అందుతుంది. ఏటా అడవుల్లో ఏయే ప్రాంతాల్లో మంటలు అంటుకుంటున్నాయో అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాలపై ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నా రాత్రి వేళ మంటలు అంటుకుంటున్నాయి. సిబ్బందికి సమాచారం అందేలోపు అడవులు కాలిపోతున్నాయి. మంటలను ఆర్పేందుకు సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతోపాటు బ్లోయర్ మిషన్లు అందుబాటులో ఉంచినా మంటలను ఆర్పడంలో సిబ్బంది విఫలమవుతున్నారు. జిల్లాలో ఖానాపూర్, పెంబి, కడెం, ఉడుంపూర్ తదితర రేంజ్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో మంటలు ఆర్పుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



అటవీ ప్రాంతాల్లో మంటలు అరికట్టేందుకు జనవరి నుంచే ఫైర్‌లైన్స్ చేయిస్తున్నాం. ఖానాపూర్ అటవీ డివిజన్ పరిధిలో 20 మంది సిబ్బంది ప్రత్యేకంగా మంటలు ఆర్పడం కోసం నిత్యం పనిచేస్తున్నారు. అడవుల్లో తునికాకు సేకరణకు, పశువులను మేపేందుకు వెళ్లినవారు అడవిలో బీడీ, సిగరేట్ తాగి అక్కడే పడేస్తున్నారు. దీంతో నిప్పు మెల్లగా రగులుకుని మంటలు అంటుకుంటున్నాయి. అడవులకు హాని తలపెట్టిన వారిపై వైల్డ్‌లైఫ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– కోటేశ్వర్‌రావు, ఎఫ్‌డీవో, ఖానాపూర్

మళ్లీ లంపీస్కిన్..!

- జిల్లాలోని పశువుల్లో కనిపిస్తున్న లక్షణాలు
- దేగాంలో రెండునెలల దూడ మృత్యువాత
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పశుసంవర్ధక శాఖ



మాటేగాంలో లంపీస్కిన్ లక్షణాలున్న దూడ

భైంసాటౌన్(ముధోల్): జిల్లాలో లంపిస్కిన్ వ్యాధి మళ్లీ విజృంభిస్తోంది. భైంసా డివిజన్‌లోని కొన్ని పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తుండడంతో పశుపోషకులు కలవరపడుతున్నారు. భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లి, గోకుల్‌నగర్‌తో పాటు మండలంలోని మాటేగాంలో లంపీస్కిన్ వ్యాధి లక్షణాలున్న పశువులను గుర్తించినట్లు పశుసంవర్ధక శాఖ వైద్యులు చెప్తున్నారు. ఇటీవల దేగాంలో రెండునెలల దూడ లంపీస్కిన్ వ్యాధి లక్షణాలతో మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. వ్యాధి లక్షణాలున్న పశువులను వెంటనే గుర్తించి వాటికి తగిన ముందస్తు చికిత్స అందించాలని, లేనిపక్షంలో ఇతర పశువులకు వ్యాధి సోకే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నవయస్సు పశువుల్లో వ్యాధి నిరోధకత తక్కువగా ఉంటుందని, ఇవి త్వరగా వ్యాధిబారిన పడే అవకాశం ఉందని చెప్తున్నారు.

మూడు నెలలు దాటిన పశువుల్లో...

పశువుల్లో లంపీస్కిన్ వ్యాధి విస్తరించడంతో కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం సైతం చేపట్టింది. ఆ సమయంలో మూడునెలల లోపు వయస్సు ఉన్న పశువులకు వ్యాక్సిన్ వేయలేదు. దీంతో ప్రస్తుతం వాటి వయస్సు పెరగడంతో వ్యాక్సిన్ వేయని పశువుల్లో మళ్లీ లంపీస్కిన్ లక్షణాలు కనిపిస్తున్నట్లు పశువైద్యులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా బయట తిరిగే పశువుల్లో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి. పశువుల్లో లంపీస్కిన్ లక్షణాలు కనిపించిన వెంటనే వాటి యజమానులు స్పందించి పాకల్లో సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. వ్యాధి సోకిన పశువును కుట్టిన దోమలు, ఈగలు మరో పశువును కుట్టడం ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుందని, పశువుల పాకల్లో దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా వ్యాధి లక్షణాలున్న పశువులకు స్థానిక పశువైద్యశాలలో చికిత్స అందించాలని పేర్కొంటున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి...

పశువుల్లో లంపీస్కిన్ వ్యాధి సోకకుండా, వచ్చినవాటి నుంచి ఇతర వాటికి సంక్రమించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

- పశువులను వీధుల్లో తిరగనీయకుండా పాకల్లో సంరక్షణ చర్యలు చేపట్టాలి.
- పశువుల పాకల్లో దోమలు వృద్ధి చెందకుండా పొగ వేస్తూ ఉండాలి.
- కొట్టాలను శుభ్రంగా ఉంచాలి. నీరు నిలిస్తే దోమలు వృద్ధి చెందుతాయి.
- వ్యాధి సోకిన పశువును ఇతర పశువులకు దూరంగా ఉంచాలి.
- వ్యాధిబారిన పడిన పశువులను పశువైద్యాధికారుల సూచనల మేరకు చికిత్స అందించాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి

భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లి, గోకుల్‌నగర్‌లో రెండు పశువుల్లో లంపీస్కిన్ వ్యాధి లక్షణాలు గుర్తించాం. మాటేగాంలోనూ ఓ పశువు ఈ వ్యాధి బారిన పడింది. ముఖ్యంగా గ్రామాలు, పట్టణాల్లో యాజమాన్య బాధ్యతలు లేకుండా తిరుగుతున్న పశువుల్లో వ్యాధి వ్యాప్తి చెందుతోంది. వ్యాధి తీవ్రతరమై ఇతర పశువులకు సోకే ప్రమాదముంది. పశువుల యజమానులు వెంటనే స్పందించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధి లక్షణా లున్న పశువులను దగ్గరలోని పశువైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించాలి. వ్యాధి సోకిన పశువులు వీధుల్లో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ విఠల్, పశుసంవర్ధకశాఖ వైద్యులు

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



దేగాంలోని యోగా కేంద్రం

- జిల్లాలో పది శిక్షణ కేంద్రాల ఏర్పాటు
- గ్రామీణ ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యం

భైంసారూరల్(ముధోల్): యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం. ఇటీవలి కాలంలో అనారోగ్య సమస్యలు తీవ్రతరమవుతున్నాయి. గుండెపోటు రావడంతో మనుషులు ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలిపోతున్నారు. ఇటీవల ఇలాంటి మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం యోగా సాధన చేస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

రుగ్మతల బారిన పడకుండా...

మారుతున్న కాలానికి అనుగుణంగా తీసుకునే ఆహార నియమాల్లో మార్పుల కారణంగా ప్రజలు అతి చిన్న వయస్సులోనే డయాబెటిస్, బీపీ, షుగర్, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. వీటి నుంచి బయటపడాలంటే ప్రస్తుతం పాత పద్ధతిలో యోగా, ఇతర ఆసనాలతో విముక్తి పొందవచ్చు. ప్రతిఒక్కరూ రుగ్మతల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణుల ముంగిట యోగా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా వ్యాధుల బారిన పడితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఆశాఖ కార్యక్రమాలను ప్రారంభించింది. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రులకు వెళ్లకుండా ఇంటినే వైద్యశాలగా మార్చుకోవచ్చు. వివిధ రకాల దినుసులతో తయారు చేసిన మిశ్రమాలు, పెరట్లో లభించే ఔషధ మొక్కలతో వ్యాధులను ఎలా నయం చేసుకోవాలన్న విషయాలపై యోగా శిక్షణ కేంద్రాల్లో ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

జిల్లాలో పది కేంద్రాలు

ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆయుష్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పది యోగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో శిక్షణ కేంద్రానికి రూ.6 లక్షల చొప్పున పది కేంద్రాలకు రూ.60 లక్షల నిధులు కేటాయించారు. ఇందులో గ్రామీణ ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లాలో నిర్మల్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో రెండు, కడ్తాల్, పొన్కల్, గుండంపల్లి, కుంటాల, బాసర, తానూరు, పల్సి, దేగాం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున యోగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మరి కొన్ని చోట్ల చివరి దశలో ఉన్నాయి. త్వరలో యోగా కేంద్రాలను ప్రారంభించడానికి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను యోగా శిక్షకుడు వివరిస్తారు. శిక్షణ కేంద్రాల్లో షెడ్డు ఏర్పాటు చేసి వాటి చుట్టూ తులసి, కలబంద, పారిజాతం, రావి, మారేడు వంటి 15 రకాల మొక్కలు నాటనున్నారు.



లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని పార్‌పెల్లిలో ఆదివారం జడకొప్ప వేశారు. ప్రతీ సంవత్సరం రెండో ఆదివారం జడకొప్ప వేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పార్‌పెల్లి గ్రామస్తులు బస్టాండ్ సమీపంలో జడకొప్ప వేశారు. ఈ సందర్భంగా కోలలు వేస్తూ పాటలు పాడారు. నృత్యం చేస్తూ వెళ్లే క్రమంలో మహిళల జడవలే తాళ్లు అల్లుకోవడం దీని ప్రత్యేకత. గత 20 నుంచి 25 సంవత్సరాలుగా జడకొప్ప వేస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేందర్, ఎఫ్‌ఏ అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గజ్జలమ్మ దేవికి ప్రత్యేక పూజలు



కుంటాల(ముధోల్): కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నపిల్లల తలనీలాలు సమర్పించారు. తులాభారం వేసి మొక్కులు తీర్చుకున్నారు. గురుస్వామి జక్కని గజేందర్, పూజారి నగేష్ ఆధ్వర్యంలో గజ్జలమ్మకు అభిషేకం, అలంకరణ, పల్లకీసేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

'మహబూబాబాద్ ఘటనపై విచారణ జరిపించాలి'

ఖానాపూర్: మహబూబాబాద్ జిల్లాలోని కేజీబీవీలో ఇటీవల విద్యార్థులు అస్వస్థతకు కారణమైన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లంబాడా హక్కు ల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను విధిగా పర్యవేక్షించాల్సిన అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతీరోజు ఎక్కడో ఓ చోట ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఘటనలు పదేపదే వెలుగు చూస్తున్నాయన్నారు. సమావేశంలో నాయకులు అశోక్, నవీన్, రాజ్‌కుమార్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.



అనంతపేట్ శివారులోని అసైన్డ్ భూమిలో మొరం తవ్వకాలు



కలెక్టరేట్ రోడ్డుకు అక్రమంగా తవ్విన మొరాన్ని చదును చేస్తున్న రోడ్డురోలర్

నిర్మల్ రూరల్ మండలం అనంతపేట్ శివారులో అటవీ భూమితో పాటు అసైన్డ్ భూముల్లో అక్రమంగా మొరం తవ్వకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ అనుమతి లేకుండా కొందరు జేసీబీలు, ప్రొక్లెయినర్లతో గుట్టలను తొలుస్తూ తవ్వకాలు చేపడుతున్నారు. నూతన కలెక్టర్ కార్యాలయం ముందు నిర్మిస్తున్న రోడ్డు పనుల కోసం టిప్పర్ల ద్వారా మొరంను తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇటు రెవెన్యూ, అటు ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



ఫారెస్ట్ భూమిలో మొరం తవ్వకాలు

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్

నిర్మల్‌టౌన్‌: జిల్లాకేంద్రంలోని బైల్‌బజార్ ప్రాంతంలో పేకాటస్థావరంపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.10,460 వేల నగదు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శనగ రైతులకు కుచ్చుటోపీ



పోలీస్‌స్టేషన్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న రైతులు (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని కుప్టి, కుమారి గ్రామాల రైతుల నుంచి సుమారుగా వెయ్యి క్వింటాళ్ల శనగ పంటను ఇద్దరు వ్యాపారులు రెండేళ్ల క్రితం కొనుగోలు చేసి రైతులకు రూ.54లక్షల పైచిలుకు కుచ్చుటోపీ వేశారు. అయితే సంవత్సరాల తరబడి రైతులకు డబ్బులు ఇవ్వకపోవడంతో వారు రెండు రోజుల క్రితం నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివాసీ జనసంరక్షణ వెల్ఫేర్ సొసైటీ పేరుతో శనగ కొనుగోళ్లను జైనూర్ మండలం ఊసగామ్‌కు చెందిన సోయం రవీందర్, మధ్యవర్తిగా బోథ్ మండలం ధన్నూర్ గ్రామానికి చెందిన సంగెపు బొర్రన్న ఉండడంతో ఈ శనగ పంటను విక్రయించినట్లు రైతులు పేర్కొన్నారు. 15 రోజుల్లోగా డబ్బులు ఇస్తామంటేనే శనగ పంటను విక్రయించామని, ఇప్పటివరకు ఇవ్వకపోవడంతో ఇటీవల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

చెన్నూర్‌రూరల్‌: మండలంలోని ఒత్కులపల్లి గ్రామానికి చెందిన కోగిల సమ్మక్క(45) మహిళ శనివారం రాత్రి విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. సమ్మక్క ఇంటిలో టీవీ ఆన్ చేయడానికి ఇంటి ముందు కిటికీ పక్కన గోడకు ఉన్న ప్లగ్ బాక్సుకు టీవీ ప్లగ్ పెడుతున్న క్రమంలో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త మల్లయ్యతో పాటు కుమారుడు ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎల్లక్కపేటలోని చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సూర్యప్రకాశ్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బెజ్జూర్‌: బైక్‌పై నుంచి కిందపడి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని సోమిని గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్ వివరాల ప్రకారం... కొర్తే మోహన్(20) అందుగులగూడ గ్రామంలోని ఓ శుభకార్యానికి బైక్‌పై బయలుదేరాడు. ఆ గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి గుంతలో పడ్డాడు. గుంతలోని బండరాళ్లు తలకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఏడు నెలల బాలుడు, భార్య ఉన్నారు.

‘గురుకులం’లో ప్రవేశాలు



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

- ఈ నెల 16 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 5వ తరగతిలో ప్రవేశాలు
- ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష
- ఆదిలాబాద్ రీజియన్‌లో 17 గురుకులాలు, 1,360 సీట్లు

ఆదిలాబాద్ రీజియన్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు	: 17
5వ తరగతిలో ప్రవేశాలకు ఒక్కో పాఠశాలలో 80 సీట్ల చొప్పున	: 1,360

మంచిర్యాలటౌన్‌: కేజీ టు పీజీ ఉచిత విద్యలో భాగంగా ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి గత నెలలోనే ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించి ఈ నెల 6వ తేదీ వరకు చివరి తేదీగా నిర్ణయించగా విద్యార్థుల సౌకర్యార్థం గడువును ఈ నెల 16వ తేదీ వరకు పొడిగించారు. ఇంగ్లిషు మీడియంలో విద్యా బోధనను విజయవంతంగా కొనసాగిస్తున్న గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలను పొందేందుకు విద్యార్థులు ఆసక్తిని చూపిస్తున్నారు. గత నెల 9వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉంది.

ఆదిలాబాద్ రీజియన్‌లో 17 పాఠశాలలు...

ఆదిలాబాద్ రీజియన్‌లోని ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో 17 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలున్నాయి. 5వ తరగతిలో 80 సీట్ల చొప్పున ప్రవేశాలను జరుపుతుండగా, మొత్తం 1,360 సీట్లు ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధనతో పాటు, భోజన వసతి, సకల సదుపాయాలు కల్పించనున్నారు. మొత్తం 80 సీట్లకు ఎస్సీలకు 60, కన్వర్టెడ్ క్రిస్టియన్లకు 2, ఎస్టీలకు 5, బీసీలకు 10, మైనారిటీలకు 2, ఓసీ/ఈబీసీలకు 1 సీటును కేటాయిస్తారు. ఆయా పాఠశాలల్లో ఒక్కోసారి ప్రవేశం పొందితే 10వ తరగతి వరకు ఉచితంగా చదువు, హాస్టల్ వసతితో పాటు, అన్ని రకాల వసతులను కల్పించడం, పుస్తకాలు, బట్టలు, కాస్మొటిక్ చార్జీలను అందిస్తారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్ గర్ల్స్, బోథ్ గర్ల్స్, ఇచ్చోడలో బాయ్స్ గురుకులాలు ఉన్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్ బాయ్స్, సిర్పూర్(టి) బాయ్స్, సిర్పూర్(టి) గర్ల్స్, కాగజ్‌నగర్ గర్ల్స్, రెబ్బెన గర్ల్స్ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలో లక్సెట్టిపేట్ గర్ల్స్, చెన్నూరు గర్ల్స్, జైపూర్ బాయ్స్, కోటపల్లి బాయ్స్, మంచిర్యాల బాయ్స్, మందమర్రి గర్ల్స్, బెల్లంపల్లి బాయ్స్(సీఈవో), బెల్లంపల్లి గర్ల్స్, కాసిపేట బాయ్స్ ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు

సాంఘిక గురుకుల సంక్షేమ పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు కేవలం ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం www.tswreis.ac.in, http:/tgcet.cgg.gov.in, http:/tgtwgurukulam.telangana.gov.in వెబ్‌సైట్‌లలో ఈ నెల 16వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. దరఖాస్తుకు రూ.100 చెల్లించడంతో పాటు, ఒక ఫోన్ నంబరుతో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవచ్చు. వేరే వారి ఫొటోలు పెట్టి దరఖాస్తు చేస్తే వారిపై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. దరఖాస్తుదారులకు ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ నంబర్ 1800 425 45678, 040–24734899, 9121174434 లేదా ప్రాస్పెక్టస్‌లో పేర్కొన్న సంబంధిత గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఫోన్‌లో సంప్రదించవచ్చు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు2022–23 విద్యాసంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులు, ప్రవేశపరీక్షను ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహిస్తారు.

ఇవీ ప్రత్యేకతలు..

- సన్నబియ్యంతో సహా అన్ని పోషక విలువలు ఉన్న రుచికరమైన ఆహారం.
- పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా సరఫరా.
- విద్యార్థులకు స్టేషనరీ (పెన్సిల్, రికార్డు పుస్తకాలు వంటివి) ఉచితం.
- మూడు జతల స్కూల్ యూనిఫాం, ట్రంకు బాక్సులు సరఫరా
- పీ.టి. డ్రెస్, ట్రాక్ సూట్, స్పోర్ట్స్ షూ, సాక్స్, నైట్ డ్రెస్, ప్లేట్, గ్లాస్, కటోర, స్పూన్, బెడ్‌షీట్, బ్లాంకెట్, పరుపులు ఉచితంగా సరఫరా.
- విద్యార్థులకు సబ్బులు కొనేందుకు డబ్బుల పంపిణీ.
- నెలలో నాలుగుసార్లు చికెన్, రెండుసార్లు మటన్‌తో భోజనం.
- వారంలో నాలుగు రోజులు కోడిగుడ్లు, ఆరు రోజులు పండ్లు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఈ నెల 16వ తేదీ వరకు స్వీకరిస్తారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు, ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని 17 గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు చేసుకునేందుకు అవకాశం ఉంది.

– కొప్పుల స్వరూపారాణి, గురుకుల విద్యాలయాల ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినేటర్

‘అడెల్లి’కి పోటెత్తిన భక్తులు



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సారంగపూర్‌: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాక మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు అయిటి చందు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సారంగపూర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తల్లిదండ్రుల పేరు నిలబెట్టారు

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



స్వాగత తోరణం ప్రారంభిస్తున్న మంత్రి

లక్ష్మణచాంద: తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల కోసం గ్రామం వద్ద స్వాగత తోరణం ఏర్పాటు చేసి వారి పేరును నిలబెట్టారని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోన్ మండలం సాకెర గ్రామానికి చెందిన విశ్రాంత తహసీల్దార్ సక్కాని సువర్ణ లక్ష్మి–గంగారంల జ్ఞాపకార్థంగా కుమార్తె భవాని–అల్లుడు శంకర్‌లు ఏర్పాటు చేసిన స్వాగత తోరణాన్ని ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎప్పటికి మర్చిపోవద్దన్నారు. పిల్లల ఉన్నతి కోసం వారు ఎన్నో త్యాగాలు చేస్తారని, వృద్ధాప్యంలో వారికి అండగా ఉండి సేవలందించాలన్నారు. సోన్ జెడ్పీటీసీ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నాబావుసాఠె ఆదర్శప్రాయుడు

- ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మన్లు జనార్దన్, కోవలక్ష్మి
- నార్నూర్‌లో అన్నాబావుసాఠె విగ్రహం ఆవిష్కరణ
- సొంత నిధులతో ఏర్పాటు చేయించిన సర్పంచ్ గజానంద్



అన్నాబావుసాఠె విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

నార్నూర్‌: సాహితీ రత్న డాక్టర్ అన్నాబావుసాఠె ఆదర్శప్రాయుడని, ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, కుమురంభీం ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. నార్నూర్ మండల కేంద్రంలో సర్పంచ్ గజానంద్‌నాయక్ సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన అన్నాబావుసాఠె విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. మహనీయుల చరిత్రలు తెలుసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రతీ కుటుంబంలో పిల్లల చదువుకునేలా చూడాలన్నారు. అన్నివర్గాల ప్రజలు ఐక్యంగా ఉంటేనే సమాజం, గ్రామం అభివృద్ధి చెందుతుందని వివరించారు. అనంతరం లంబాడా సంప్రదాయ దుస్తులతో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని గిరిజన మహిళలు సన్మానించారు.

గిరిజనేతరుల సమస్యలు పరిష్కరిస్తాం

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరులకు ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని దళిత నేతలు జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నివాసముంటున్న దళితుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని వివరించారు. సీఎం కేసీఆర్, సీఎస్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో మతాంగ్ ఋషి సంస్థాన్ పీఠాధిపతి గజానంద్ మౌలి, ఎంపీపీ కనక మోతుబాయి, సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, కుమురంభీం జిల్లా గ్రంథాలయశాఖ చైర్మన్ కనక యాదవ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, గాదిగూడ వైస్ ఎంపీపీ యోగేష్, ఎంపీటీసీ పరమేశ్వర్, అన్నాబావుసాఠె కమిటీ జిల్లా అధ్యక్షుడు కాంబ్లె ఉదయ్, మండల అధ్యక్షుడు కొరెళ్ల మహేందర్, కార్యదర్శి బర్‌కుంబే రాజు, దళిత నాయకులు భారత్ వాఘ్మారే, నర్సింగ్‌మోరే, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు యునుస్ అక్బానీ ఉన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని సన్మానిస్తున్న లంబాడీ గిరిజన మహిళలు

ఉచిత శిక్షణ.. ఉపాధికి భరోసా

- నిరుద్యోగ మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ
- నాలుగేళ్లల్లో 50వేల మందికి..
- పలు రంగాల్లో ఉపాధి పొందుతున్న మహిళలు

జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో...

- 2019 నుంచి 2022 వరకు 50వేల మందికి
- నాలుగేళ్లలో 12మండలాల్లో పూర్తి
- ఈ ఏడాది 6 మండలాల్లో 1800 మందికి శిక్షణ
- ఇప్పటి వరకు శిక్షణ పొందిన 500మందికి బ్యాంకుల ద్వారా రుణాలు



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు జ్ఞానేశ్వరి. జన శిక్షణ సంస్థలో బ్యూటిషన్‌గా మూడు నెలల పాటు శిక్షణ తీసుకుంది. ప్రస్తుతం మండల కేంద్రంలోని బ్యూటిషన్ శిక్షకురాలిగా శిక్షణ పొందిన సంస్థలోనే పనిచేస్తూ నెలకు రూ.9వేలు సంపాదిస్తోంది. అలాగే ఇతర సమయాల్లో సొంతంగా బ్యూటిషన్‌గా పనిచేస్తోంది.



ఇచ్చోడలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఇచ్చోడ: జిల్లాలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ పలు రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని జన శిక్షణ సంస్థ. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి వారికి స్వయం ఉపాధి వైపు అడుగులు వేసేలా కృషి చేస్తోంది. జన శిక్షణ సంస్థ కేంద్ర ప్రభుత్వ వృత్తి నైపుణ్యత అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నాలుగేళ్లలో నార్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, జైనథ్, బేల మండలాల్లో 50వేల మంది మహిళలకు శిక్షణ అందచేశారు.

ఈ ఏడాది అరు మండలాల్లో ...

ఈ ఏడాది తాంసి, తలమడుగు, బజార్‌హత్నూర్, బోథ్, ఇచ్చోడ, ఆదిలాబాద్ మండలాల్లో 90బ్యాచ్‌లుగా విభజించి బ్యాచ్‌కు 20మంది అభ్యర్థుల చొప్పున 18 వందల మందికి శిక్షణ ఇస్తున్నారు. 90రోజుల పాటు శిక్షణ ఇచ్చి అనంతరం వారికి గుర్తింపు పత్రాలను అందచేస్తున్నారు.

శిక్షణ కోర్సులు...

నిరుద్యోగ, నిరక్షరాసులైన 15 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారికి బ్యూటిషన్, డ్రెస్‌మేకింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, జూట్ స్టిచ్చింగ్, ఎలక్ట్రిషన్ కంప్యూటర్, బాంబు బాస్కెట్ మేకర్ (వెదురు బొంగులతో తయారు చేసే వస్తువులు), ఫుడ్ ప్రాసెసింగ్, ఉలెన్‌వర్క్, కారు డ్రైవింగ్‌లో ప్రతీరోజు మూడు గంటల పాటు శిక్షణను ఇస్తున్నారు.

బ్యాంకుల ద్వారా రుణాలు

శిక్షణ పూర్తయ్యాక అభ్యర్థుల ప్రామాణికంపై గ్రేడింగ్ తీస్తారు. ఏ గ్రేడ్ పొందిన వారికి బ్యాంకుల ద్వారా జన శిక్షణ సంస్థ అందచేసిన శిక్షణ ధ్రువపత్రాల ద్వారా సొంతంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి రూ.50వేల నుంచి రెండున్నర లక్షల వరకు రుణాలు ఇప్పిస్తున్నారు.

మహిళలు ముందుకు రావాలి



జిల్లాలో ఇప్పటి వరకు 50వేల మందికి వివిధ రంగాల్లో శిక్షణ పూర్తిచేశాం. ఇంకా మహిళలు ఈ శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. జన శిక్షణ సంస్థ ద్వారా శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు.

– శ్యామల , జన శిక్షణ సంస్థ డైరెక్టర్

దోషులను కఠినంగా శిక్షించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి



బామ్నికేలో అంబేద్కర్ విగ్రహానికి పేడ మరకలు

లోకేశ్వరం: మండలంలోని బామ్నికేలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పేడకొట్టి అవమానపర్చిన దోషులను కఠినంగా శిక్షించాలని వీడీసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం తెల్లవారుజాము పేడ మరకలతో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని చూసి గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ముథోల్ సీఐ వినోద్ రెడ్డి, లోకేశ్వరం ఎస్సై సాయికుమార్‌లు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. దోషులను పట్టుకుని వారిపై చట్టారీత్య చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ సునీత, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.

పిచ్చికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

నెన్నెల: మండలంలోని మైలారంలో ఆదివారం పిచ్చికుక్కల దాడిలో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఎస్సీవాడలో ఇంటి ముందు ఆడుకుంటున్న వేల్పుల ప్రణీత్(5)పై కుక్క దాడి చేయగా అతడిని కాపాడేందుకు వెళ్లిన లింగంపల్లి నీరజను తీవ్రంగా గాయపర్చింది. వీరితో పాటు బాలవోనివాడలో పోల్క చరణ్ పిచ్చికుక్కల దాడిలో గాయపడ్డాడు. దీంతో వారిని నెన్నెల పీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించారు. ఒకేరోజు ముగ్గురిపై దాడి చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పొలాలకు వెళ్లే రైతులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు జంకుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పిచ్చికుక్కల బెడదను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఆలయంలో ఎమ్మెల్యే జోగురామన్న కుటుంబీకులు



అక్షరాభ్యాస మండపంలో ఎమ్మెల్యే జోగు రామన్న కుటుంబీకులు



పూజల్లో పాల్గొన్న వరంగల్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, వరంగల్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కుటుంబ సమేతంగా ఆదివారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న మనువరాలు మహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కుటుంబీకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎమ్మెల్యే జోగు రామన్నను ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కలిసి శాలువాతో సత్కరించారు.

క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు ఆదివారం సర్పంచ్ హన్మండ్లు భూమిపూజ చేశారు. రూ.1.30లక్షలతో సీసీ రోడ్డు, రూ. 50వేలతో డ్రెయినేజీ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మీరజ్, హన్మండ్లు, సురేశ్, గ్రామస్తులు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పేర్లు నమోదు చేసుకోవాలి

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏప్రిల్ 9న నిర్వహించతలపెట్టిన నాలుగున్నర దశాబ్దాల ఆత్మీయ సమ్మేళనం కోసం పూర్వ విద్యార్థులంతా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కార్యక్రమ నిర్వాహకులు కోరారు. ఆదివారం పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఖానాపూర్ జూనియర్ కళాశాలలో 1978 నుంచి 2023 వరకు చదువుకున్న పూర్వవిద్యార్థులతో జరిగే సమ్మేళనం కోసం ఇప్పటికే 1,265 మంది పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. సమావేశంలో నిర్వాహకులు వాల్గొట్ కిషన్, కాలేరి భూమేశ్వర్, బోనగిరి నరేందర్, రాచమల్ల రాజశేఖర్, కామాజి శ్రీనివాస్, రవీందర్, వెంకట్రాములు, గంగన్న, గంగాధర్, శంకర్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

భక్తిమార్గంలో నడవాలి


ప్రవచనం చెబుతున్న మాధవ్ మహారాజ్

తానూరు: ప్రతీ ఒక్కరు భక్తిమార్గంలో నడవాలని మాధవ్ మహారాజ్ బోర్‌వడికర్ అన్నారు. ఆదివారం మండలంలోని భోసి గ్రామంలో నిర్వహించిన కీర్తనలో పాల్గొని భక్తులకు పలు సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు దూరం తులసీమాల ధరించి భగవంతుడ్ని స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సప్తాహం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: నిజామాబాద్‌లో ఈనెల 13, 14వ తేదీల్లో నిర్వహించే తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర తొమ్మిదో మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేశ్ కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాసే చట్టాలను విరమించుకోవాలన్నారు. ఎన్నికల వేళ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు విలాస్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం లింగన్న తదితరులు ఉన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	15
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : సార్
నారాయణ: బలగం

రోడ్లకు మరమ్మతులెప్పుడో?

- కుభీర్ మండలంలో అధ్వానంగా రోడ్లు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు
- సమస్య పరిష్కరించాలని వాహనదారుల వేడుకోలు


మండలంలోని కస్రా రోడ్డు దుస్థితి


కంకర తేలి ప్రమాదకరంగా మారిన వీర్‌గాం- హల్దా రోడ్డు

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్లు దెబ్బతినడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కుభీర్–భైంసా డబుల్ రోడ్డు, పల్సి–భైంసా రోడ్డు తప్ప మిగిలిన అన్ని రోడ్లన్నీ ప్రమాదకరంగా మారాయి. కొన్ని రోడ్లయితే బీటీ లేకుండా కంకరతేలి ఉన్నాయి.

మండలంలో..

కుభీర్ మండలంలో 41 జీపీలున్నాయి. కుభీర్–బెల్గాం రోడ్డు, బెల్గాం ఎక్స్‌రోడ్డు–దార్‌కుభీర్ రోడ్డు, సోనాలి– గోడాపూర్ రోడ్డు, కుభీర్– సిర్‌పల్లి, భైంసా నుంచి పార్డి(బి) మీదుగా మహారాష్ట్ర వెళ్లే రోడ్డు, కుభీర్ నుంచి మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్ వెళ్లే రోడ్డు, కుభీర్–పల్సిరోడ్డు, కుభీర్–కస్రా రోడ్డు, వీర్‌గాం ఎక్స్‌రోడ్డు నుంచి హల్దా వరకు రోడ్డు దెబ్బతినడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

వర్షాలకు కొట్టుకపోయిన రోడ్లు..

రెండేళ్ల కాలంలో కురిసిన అధిక వర్షాలకు పలు చోట్ల రోడ్లు కొట్టుకుపోగా.. మరికొన్ని చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. రోడ్ల సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. కాని నిధుల్లేని కారణంగా రోడ్లకు మరమ్మతులు చేయడం లేదు. పార్డి(బి)–భైంసా రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో పోసిన ఎర్రని ఇసుక గాలికి లేస్తుండటంతో ముందు వచ్చే వాహనాలు కన్పించక వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు.

కోతకు గురైన రోడ్లు..

వర్షాలకు మండలంలోని పలు రోడ్లు కోతకు గురయ్యాయి. సర్వెల్లి రోడ్డు కోతకు గురవగా సోనారి–గోడాపూర్ రోడ్డు దుస్థితి అలానే ఉంది. కుభీర్–పార్డి(బి) రోడ్డు సగం వరకు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో రాత్రివేళ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పల్సిరోడ్డుకు ఓ చోట బుంగ ఏర్పడింది. హల్దా–దార్‌కుభీర్ రోడ్డుకు కంకర తప్ప బీటీ మచ్చకైనా లేదు. దార్‌కుభీర్, హల్దా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు మూడేళ్లగా చెబుతున్నా.. ఇప్పటికీ పనుల జాడ కానరావడం లేదు. దార్‌కుభీర్–బెల్గాం గ్రామాల వద్ద వరదకు కల్వర్టులు కొట్టుకపోగా తాత్కాలిక మరమ్మతులు చేశారు.

సమస్య పరిష్కరించాలి..

చోదకులు ఈ రోడ్లపై ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాహనాలను నడుపుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కొన్ని పనులకు నిధులు మంజూరయ్యాయి

ప్రస్తుతం కొన్ని రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. మొల, రంజని, సోనారి గ్రామాల్లో రోడ్డు పనులు జరుగుతున్నాయి. మరికొన్నింటికీ నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కావాల్సి ఉంది. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులు జరుగుతాయి.

– కొండయ్య ఆర్‌అండ్‌బీ డీఈ, భైంసా

రోడ్లను నిర్మించాలి



మండలంలోని ఆయా గ్రామాల్లో చాలా రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి.. వాటికి తక్షణమే మరమ్మతులు చేయించి వాహన చోదకుల ఇబ్బందులను దూరం చేయాలి.

– జాదవ్ పండిత్, ఫకీర్‌నాయక్ తండా

సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం దెబ్బతిన్న రోడ్ల వద్ద, మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. గ్రామాల్లో రోడ్లపై వాహనదారులకు ఇబ్బందిగా ఉన్నా.. పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలను తొలగించాలి.

–బి.గంగాశేఖర్, కుభీర్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


ముధోల్‌లో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముధోల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయిమాధవ్‌నగర్‌లో రూ.25లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, బీఆర్‌ఎస్ నాయకులు ఆఫ్రోజ్‌ఖాన్, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు మాగ్దూస్, మాజీ బాబన్న, పోతన్నయాదవ్, రమాకాంత్ పటేల్, గంగాధర్ పటేల్, శ్రీనివాస్‌చారి, సాయిప్రసాద్ తదితరులు ఉన్నారు.

భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

భైంసా: బాసర మండలం కిర్గుల్(బి) గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఆదివారం స్థానిక సర్పంచ్ పెద్దకొండు సుధాకర్‌రెడ్డితో కలిసి గ్రామంలో పర్యటించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలను తెలుసుకున్నారు. మరిన్ని నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిప్పెర కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. పిచ్చిమొక్కలు తొలగించరూ..



తానూరు: మండలంలోని దాగాం నుంచి తానూరు ఎక్స్‌రోడ్డు వరకు రెండు కిలోమీటర్ల మేర రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్ పీఆర్ ఏఈ, ఫోన్: 91211 35623

'బండి సంజయ్‌పై చర్య తీసుకోవాలి'


ఖానాపూర్‌లో దహనం చేస్తున్న నాయకులు


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఖానాపూర్: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడారు. కవితపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని సంజయ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజగంగన్న, రాజేందర్, ఖలీల్, శంకర్, వెంకాగౌడ్, మోహిద్, రామునాయక్, గంగాధర్, కెహెచ్ ఖాన్, ప్రదీప్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నిర్మల్‌టౌన్: ఎమ్మెల్సీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేసి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వరకు పాదయాత్రగా వెళ్లి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలంగాణ జాగృతి అధ్యక్షుడు లక్ష్మణచారి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్డుపై పంట.. ప్రజలకు తంటా

- వాహనదారులకు తప్పని తిప్పలు
- రాత్రివేళ పొంచి ఉన్న ముప్పు


ధర్మోరలో రోడ్డుపై మక్కలు ఆరబెడుతున్న రైతు


లోకేశ్వరం నుంచి దేగాం వెళ్లే మార్గంలో రోడ్డుపై ఆరబెట్టిన కంకులు

లోకేశ్వరం: విత్తనం నాటినప్పటి నుంచి చేతికొచ్చిన పంటను అమ్ముకునేందుకు రైతులు పడే కష్టాలు వర్ణనాతీతంగా ఉంటాయి. ప్రస్తుతం లోకేశ్వరం మండలంలోని ఆయా గ్రామాల్లో మొక్కజొన్న పంట చేతికొచ్చింది. కానీ ఈ పంట ఎండాలంటే.. తారురోడ్డు ఎక్కాల్సిందే. కొన్ని గ్రామాల్లో రైతులు వాహనదారులకు ఇబ్బంది కల్గకుండా మక్కలను మాత్రమే రోడ్లపై ఆరబెట్టుకోవాలని నిబంధనలు విధించుకున్నారు. కానీ కొన్ని గ్రామాల్లో రోడ్లపైనే కంకులు, మక్కలు రోజుల తరబడి ఆరబెడుతున్నారు. దీంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పంట కుప్పలతో ప్రమాదాలు..

గతంలో రోడ్డుపై ఓ పక్క మక్కలు, సోయా, ధాన్యం ఆరబెట్టడంతో రాత్రి ఈ పంట కుప్పలు కన్పించక ప్రమాదాలు జరిగిన ఘటనలు లేకపోలేదు. కొందరు తీవ్రంగా గాయపడితే.. మరికొందరు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. రోడ్డుపై పంట ఆరబెట్టకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరితే.. తాము ఎక్కడ పంటను ఆరబెట్టుకోవాలని రైతులు అంటున్నారు.

సబ్సిడీపై కల్లాలు నిర్మించాలి..

వందశాతం సబ్సిడీపై సిమెంట్ ప్లాట్‌ఫారాలు(కల్లాలు) ఏర్పాటు చేయాలని రైతులు వేడుకుంటున్నా.. ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద నిర్మించుకున్న కల్లాలకే బిల్లులు రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. తమకు కల్లాలు నిర్మించి ఇస్తే రోడ్లపై ఎందుకు పంట కుప్పలు పోస్తామని.. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు వేడుకుంటున్నారు.

తప్పని పరిస్థితుల్లో ఆరబెడుతున్నాం



పంట దిగుబడులను అమ్ముకునేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డుపై మక్కకంకులు ఆరబెడుతున్నాం. కల్లాలుంటే రోడ్లపై ఎందుకు ఆరబెడతాం.

– జంబుగ సాయన్న, ధర్మోర

కల్లాలు నిర్మించాలి



ప్రభుత్వం సబ్సిడీపై సిమెంట్ ప్లాట్ ఫారాల(కల్లాల)ను నిర్మించి ఇవ్వాలి. కల్లాలుంటే ప్రయాణికులకు ఇబ్బంది కల్గించేలా రోడ్లపై ఎందుకు ఆరబెడతాం.

– మగ్గిడి భోజారెడ్డి, పంచగుడి

ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి

నిర్మల్‌టౌన్: రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లు రాజకీయంగా మరింత ఎదగాలని ముదిరాజ్ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సుంకరి పోతన్న అన్నారు. జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్ ముదిరాజ్‌ల సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ముశాపూర్ పీఏసీఎస్ చైర్మన్‌గా నియమితులైన ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది బోండ్ల గంగాధర్‌ను సన్మానించారు. అనంతరం సంఘ సభ్యులు మాట్లాడుతూ.. నిర్మల్ నియోజకవర్గంలో 45 వేలకు పైగా ముదిరాజులు ఓటర్లుగా ఉన్నారని.. అందరూ ఐక్యతతో ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ముదిరాజ్ యువత అధ్యక్షులు పాతర్ల హరీశ్, పట్టణ అధ్యక్షుడు సుంకరి ఆనంద్, బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ కొడకల గంగాధర్, ముదిరాజ్ పట్టణ కోశాధికారి సత్యనారాయణ, నేముల శ్రీను, నాయకులు ఆనంద్, విజయ్, నర్సయ్య, వివేక్, సత్యనారాయణ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


గంగాధర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఆత్మగౌరవ సదస్సుకు భైంసావాసులు

భైంసాటౌన్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానభవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు నిర్వహించారు. దీనికి భైంసా నుంచి పలువురు ఫోరం నాయకులు తరలివెళ్లారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పాల్గొని కేసుల పాలయ్యామని.. ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఫోరం అధ్యక్షులు డా. రామకృష్ణగౌడ్, సభ్యులు జాదవ్ పుండ్లిక్‌రావు, నాగనాథ్, శేఖర్ ఉన్నారు.


సదస్సులో పాల్గొన్న జిల్లా సభ్యులు

15నుంచి ఇంటర్ పరీక్షలు

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీవోలు హరిప్రసాద్, శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 355 మంది, ద్వితీయ సంవత్సరం చదివేవారు 248 మంది, గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 335 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 349 మంది పరీక్షలు రాయనున్నట్లు వారు పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఆపదలో ఉన్నవారికి అత్యవసర సమయంలో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని యువ నేస్తం ఫౌండేషన్ సభ్యులు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి, కళావతి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ప్రస్తుతం ఆ స్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి రక్తం అవసరం ఉంటుందని, సరైన సమయానికి రక్తం నిల్వలు ఉండడం లేదన్నారు. రక్తదానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సవారీబంగ్లా షెడ్డు ప్రారంభం

తలమడుగు: మండలంలోని నందిగామలో ఎమ్మెల్సీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సవారీబంగ్లా షెడ్డును ఆదివారం ప్రారంభించారు. జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, గ్రామస్తులతో కలిసి పూజలు చేసి రిబ్బన్ కట్ చేశారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. గ్రామాల్లో జెడ్పీ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకన్న, నాయకులు ప్రకాష్‌రావు, రమేష్ రెడ్డి, ప్రతాప్, గంగారం, గ్రామస్తులు రాము, రమాకాంత్, గణేశ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామ సమీపంలోని గోదావరి ఒడ్డున బ్రహ్మేశ్వరాలయం శ్రీశ్రీశ్రీ సత్యానంద సరస్వతి స్వామిజీ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆదివారం దేవతల స్థాపన, ఆరాధన, అగ్నిప్రతిష్ఠ, స్థాపిత మండప దేవత హవనం, పాదుకలకు చతుర్వేద సేవలు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదం తదితర కార్యక్రమాలు వేదపండితులు నిర్వహించారు. కార్యక్రమంలో వాడ్‌తాల్ సర్పంచ్ విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


హనుమాన్ ఆలయంలో భజన చేస్తున్న స్వాములు

శ్రీ మురళీకృష్ణ ఆలయంలో సత్సంగం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్ శ్రీ మురళీకృష్ణ ఆలయంలో ఆదివారం సత్సంగ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భజన, కీర్తనలు ఆలపించారు. అలాగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా వైద్యురాలు దొంతుల రజనీ శ్రీనివాస్‌ను సభ్యులు సత్కరించారు. పి.కిషన్, గంప శ్రీనివాస్, రాజేందర్ డి.మల్లేశ్వరి, డి.శశికళ, డి.వసంత, శంకరమ్మ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామ హనుమాన్ ఆలయంలో ఆదివారం హనుమాన్ స్వాములు భిక్ష ఏర్పాటు చేశారు. కిష్టాపూర్ గురుస్వామి నర్సాగౌడ్ ఆధ్వర్యంలో 150 మంది స్వాములు హాజరై భజనలు చేశారు.